**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

M.B.BHAVAN, 1-1-60/2,RTC X ROADS, HYDERABAD-20

☎ 040-27665011, 27665012, Fax: 040- 27601001

E-mail: email@cpimap.com


**ప్రచురణార్థం** **తేది: 26.12.2011**

## ప్రజా సమస్యలను రాజకీయ అజెండాలోకి తెస్తాం, వామపక్ష ప్రజాతంత్ర శక్తులతో ఉద్యమం

## గడిచింది భారాల సంవత్సరం...రాబోయేది బరువుల సంవత్సరం

## బడ్జెట్‌పై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి

## పార్టీ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

రాష్ట్ర రాజకీయ పరిస్థితులు అయోమయంగా ఉన్న ప్రస్తుత తరుణంలో ప్రజల దృష్టిని, మీడియా దృష్టిని మళ్లించి ప్రభుత్వం చాపకింద నీరులాగా జనంపై ఒక్కోటిగా భారాలు వేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బివి రాఘవులు విమర్శించారు. ఈ నేపథ్యంలో రాబోయే బడ్జెట్ సమావేశాల నాటికి ప్రజా సమస్యల్ని రాజకీయ అజెండాలోకి తీసుకొచ్చేందుకు వామపక్ష ప్రతాతంత్ర శక్తులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశాలు ఆది, సోమవారాల్లో హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో జరిగాయి. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రంతో కలిసి రాఘవులు పార్టీ 23వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో ప్రపంచ బ్యాంకు విధానాలు, ఆదేశాలను చడీ చప్పుడుకాకుండా అమలు చేస్తోందని విమర్శించారు. ఇందులో భాగంగానే విద్యుత్, ఆర్టీసి, వ్యాట్, ప్రాపర్టీ ట్యాక్స్, నీటి పన్నులు, ల్యాండ్ రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచిందని గుర్తుచేశారు. ఈ విధంగా రాష్ట్ర ప్రజలపై రూ.10 వేల కోట్లకుపైగా భారాలు మోపిందని చెప్పారు. డిస్కాంలకు చెల్లించాల్సిన రూ.12 వేల కోట్లు చెల్లించని కారణంగా ఇప్పుడు మరోసారి విద్యుత్ ఛార్జీలను పెంచేందుకు రంగం సిద్ధం చేసిందని అన్నారు. ఈ నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో ముగిసిపోయే 2011ను భారాల సంవత్సరంగా, రాబోయే 2012 సంవత్సరాన్ని బరువుల సంవత్సరంగా ఆయన అభివర్ణించారు. విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారాలు వేసేందుకు ప్రయత్నిస్తే గతంలో జరిగిన ఉద్యమంకన్నా (2000 ఆగస్టు) పెద్ద ఉద్యమాన్ని నిర్వహించాల్సి వస్తుందని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని రాఘవులు హెచ్చరించారు.

రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో జరుగుతున్న పార్టీ మహాసభల నుండి ఫిబ్రవరిలో జరగబోయే రాష్ట్ర స్థాయి మహాసభలకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షించామన్నారు. వివిధరంగాల్లో ప్రభుత్వ నిర్ణయాలు, ప్రజా సమస్యలపై చర్చించి తీర్మానం చేశామని చెప్పారు. ఇప్పటివరకు రాష్ట్రం ఒకటిగా ఉంటుందా? లేక విడిపోతుందా? అనే విషయాల చుట్టూనే తిరిగిన రాష్ట్ర రాజకీయాలు, ప్రస్తుతం అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటేసిన వారిని అనర్హులుగా ప్రకటిస్తారా? లేదా? అనే అంశం చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. ఇదే అదనుగా భావించిన ప్రభుత్వం కిలో రూపాయి బియ్యం, మహిళలకు వడ్డీలేని రుణాలు తదితర పథకాల పేరుతో కొన్ని మెతుకులు విదిల్చుతోందని విమర్శించారు. వీటితోపాటు మున్సిపాల్టీల్లో నీటిపన్ను, చెత్తపన్నుల్లాంటి పెంచి భారాలు మోపిందన్నారు. వీటిని పెంచే క్రమంలో ప్రభుత్వం 'ప్రజల్ని ముక్కముక్కలుగా చెక్కచెక్కలుగా విడగొట్టాలి' అనే కొత్త వ్యూహాన్ని, ఎత్తుగడను అనుసరిస్తోందని అన్నారు. ఒక్కోసారి ఒక్కోచోట ఛార్జీలను పెంచటం ద్వారా ప్రజలను పోరాటాల్లోకి రాకుండా చూస్తోందని చెప్పారు.

రాబోయే ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశాలను నిర్వహించేందుకు వీలుగా ప్రభుత్వం బడ్జెట్ తయారీకి సంబంధించిన కసరత్తులు చేస్తోందని రాఘవులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఫిక్కీ, సిఐఐ తదితర సంస్థలతో చర్చలు జరిపిన ప్రభుత్వం, బడ్జెట్‌ను సామాన్య ప్రజలకు ఉపయోగపడే విధంగా మలిచేందుకు వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో ఎందుకు సమావేశం జరపటంలేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు సంబంధించి దళిత సంఘాలు, ప్రజా సంఘాలతో ఎందుకు చర్చించటం లేదన్నారు. కరువు, విద్యుత్ తదితర సమస్యలపై ఆయా సంఘాలతో చర్చించాలని సూచించారు. బడ్జెట్‌ను రూపకల్పనకు ముందు వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని ఈ సందర్భంగా రాఘవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**(జె జయరాం)**

ఆఫీసు కార్యదర్శి